ఆటగాళ్లా ఆటబొమ్మలా..!

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

'పొగడ్త నలుగురి మధ్యలో చెబితే.. విమర్శ నాలుగు గోడల మధ్య చెప్పాలి' అని అంటారు పెద్దలు. కానీ ఐపీఎల్‌లో రెండేండ్ల క్రితం 'లక్నో సూపర్ జెయింట్స్' ఫ్రాంచైజీని కొన్న ప్రముఖ వ్యాపార దిగ్గజం సంజీవ్ గొయెంకా మాత్రం లక్నో సారథి కేఎల్ రాహుల్‌పై బహిరంగంగానే చిందులు తొక్కాడు. అలాగని రాహుల్ చేయకూడని తప్పేమీ చేయలేదు. బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ఓడిపోయినందుకు గాను గొయెంకాకు చిర్రెత్తుకొచ్చి కోపం నశాలానికి తాకింది. తాను మాట్లాడుతున్నది అంతర్జాతీయ స్థాయిలో భారత క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న స్టార్ క్రికెటర్ అన్న సంగతి కూడా మరిచిపోయి.. ఏదో గల్లీ క్రికెట్ మ్యాచ్‌లో బెట్ ఓడిపోతే ఆటగాళ్లను తిట్టినట్టు రాహుల్ ముఖం మీదే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'అసలు ఇలాగేనా ఆడటం' అన్నట్టుగా కస్సుబుస్సుమన్నాడు. మైదానంలో వందలాది కెమెరాలు, వేలాది మంది జనం ఉన్నారనే విషయం మరిచి తమ జట్టును రెండు సార్లు ప్లేఆఫ్స్ చేర్చి, నిర్జీవమైన లక్నో పిచ్‌పై అనుభవరాహిత్యమున్న బౌలర్లతోనే అద్భుతాలు చేసిన కెప్టెన్‌ను అందరిముందూ దోషిలా నిలదీశాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాక ఆటగాళ్లతో ఫ్రాంచైజీ ఓనర్ల వ్యవహార శైలి మరోసారి చర్చనీయాంశమైంది.

ఇదేం కొత్త కాదు!

ఐపీఎల్‌లో ఓనర్లు ఆటగాళ్లతో ఇలా దురుసుగా ప్రవర్తించడం ఇదే కొత్తకాదు. 2016లో చెన్నైపై నిషేధం ఉన్నప్పుడు రైజింగ్ పూణె సూపర్‌జెయింట్స్‌ను కొనుగోలు చేసిన గొయెంక.. ఆ జట్టుకు సారథిగా వ్యవహరించిన దిగ్గజ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీపైనా ఇదే తీరుగా వ్యవహరించాడని అప్పట్లో పుకార్లు షికార్లు చేశాయి. ఆ సీజన్ తర్వాత ధోనీని కెప్టెన్‌గా తప్పించి స్టీవ్ స్మిత్‌ను నాయకుడిగా నియమించడం వివాదాస్పదమైంది. ఈ సందర్భంగా సంజీవ్ సోదరుడు హర్ష్ గొయెంక ధోనీని కించపరుస్తూ చేసిన ట్వీట్‌పై అప్పట్లో భారత క్రికెట్ అభిమానులు మండిపడ్డారు. గొయెంక బ్రదర్స్‌తో పాటు ఆటగాళ్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ వ్యవహార శైలి కూడా చర్చనీయాంశమే. తమ జట్టుకు తొలి ట్రోఫీ అందించిన డేవిడ్ వార్నర్‌ను 2021 మిడ్ సీజన్‌లో అన్యాయంగా కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించడం, కేన్ విలియమ్సన్, ఎయిడెన్ మార్క్‌రమ్‌నూ ఇలాగే వాడుకుని వదిలేయడం విమర్శలకు తావిచ్చింది. 2022 సీజన్‌లో చెన్నై ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా.. సీఎస్‌కే యజమానుల ఒత్తిడి తట్టుకోక 'నా వల్ల కాదు మహాప్రభో' అని సీజన్ మధ్యలోనే ధోనీ ఇచ్చిన కెప్టెన్సీ కాడి వదిలేశాడు. ముంబైకి ఐదు ట్రోఫీలు అందించిన రోహిత్ శర్మపై అంబానీల తీరూ విమర్శలమయమే అయింది. ఇటీవల సంజూ శాంసన్ ఔటైపై థర్డ్ అంపైర్ టీవీ రిప్లైలు చూస్తుండగానే స్టేడియం లాబీలో మ్యాచ్ చూస్తున్న క్యాపిటల్స్ యజమాని పార్థ్ జిందాల్.. 'నువ్వు ఔట్.. ఔట్..' అంటూ అరవడమూ వివాదాస్పదమైంది.

కార్పొరేట్ మయం

ఐపీఎల్‌లో ప్రస్తుతమున్న పది జట్ల యజమానులు కోటాను కోట్ల వ్యాపార సామ్రాజ్యాలకు అధిపతులే. 'యువ ఆటగాళ్లను ప్రోత్సహించడం, ప్రేక్షకులకు క్రికెట్ వినోదాన్ని అందించడం' అనే ఐపీఎల్ ప్రాథమిక సూత్రాలను పక్కనబెడితే ఓనర్లు ఈ ఆటను పూర్తి వ్యాపార దృష్టితోనే చూస్తున్నారనేది జగమెరిగిన సత్యం. బీసీసీఐ కూడా 'డబ్బు ప్రధానం'గానే ఈ టోర్నీని నిర్వహిస్తుందనేది ఎప్పట్నుంచో ఉన్న విమర్శ. దీంతో ఫ్రాంచైజీ ఓనర్లకు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది పరిస్థితి. లీగ్‌ను శాసించే స్థాయికి చేరిన ఈ సామ్రాజ్యాధిపతులు.. ఆటగాళ్లు విఫలమైతే వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలకు దిగుతున్నారు. వ్యాపారాల్లో పోటీతో పాటు ఐపీఎల్‌లో ట్రోఫీ గెలవడమన్నది ఫ్రాంచైజీల 'పెట్టుబడి' దారులకు ఓ ప్రతిష్టగా మారింది. ఆటలో గెలుపోటములు సహజమన్న విషయాన్ని గాలికొదిలి 'గెలవకుంటే గెంటివేతే' అన్నట్టుగా వ్యవహరిస్తూ ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తమ బానిసలుగా చేసుకుంటున్నాయని అభిమానులు వాపోతున్నారు.

లక్నోకు రాహుల్ గుడ్ బై?

లక్నో: లక్నోకు సారథి రాహుల్ గుడ్ బై చెప్పనున్నట్టు తెలుస్తోంది. సంజీవ్ గొయెంకతో చాట్ అనంతరం రాహుల్ మనసు నొచ్చుకున్నాడని, ఈ సీజన్‌లో లక్నో ఆడబోయే మిగిలిన రెండు మ్యాచ్‌లకూ అతడు కెప్టెన్‌గా ఉండటం కష్టమేనని జట్టు అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. వచ్చే సీజన్‌లో లక్నో.. రాహుల్‌ను రిటైన్ కూడా చేసుకోదన్న వార్తలూ వినిపిస్తున్నాయి. 2022 సీజన్‌లో లక్నో.. రాహుల్‌ను రూ.17 కోట్లతో దక్కించుకుంది.

భారత్ 5-0

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం సిల్హెట్ వేదికగా జరిగిన ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 21 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 156 పరుగులు చేసింది. స్వల్ప ఛేదనలో బంగ్లా.. 20 ఓవర్లలో 135/6కే పరిమితమైంది. స్పిన్నర్ రాధా యాదవ్ (3/24) ఆతిథ్య జట్టును కట్టడి చేసింది. సిరీస్ ఆద్యంతం రాణించిన రాధకే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు వరించాయి.

జ్యోతికి స్వర్ణం

న్యూఢిల్లీ: భారత యువ అథ్లెట్ యర్రాజీ జ్యోతి పసిడి పతకంతో మెరిసింది. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న హ్యారీ స్కట్లింగ్ గేమ్స్‌లో బుధవారం జరిగిన మహిళల 100మీటర్ల హర్డిల్స్ రేసును జ్యోతి 12.87సెకన్లలో ముగించి స్వర్ణం కైవసం చేసుకుంది. ఈ సీజన్ ఔటిడోర్ కాంపిటీషన్‌లో ఈ తెలుగు అథ్లెట్‌కు ఇది తొలి పతకం. కెరీర్‌లో నాలుగో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జ్యోతి..ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 26వ ర్యాంక్‌లో కొనసాగుతున్నది. పారిస్ ఒలింపిక్స్ 100మీ హర్డిల్స్‌లో పోటీపడనుంది.

ఆర్సీబీకి నాలుగో విజయం

బెంగళూరు జోరు

విరాట్ కోహ్లీ సెంచరీ మిస్ • ప్లేఆఫ్స్ రేసు నుంచి పంజాబ్ ఔట్

ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులోనే ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా నాలుగో విజయంతో కదం తొక్కింది. ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ మ్యాస్ట్రో విరాట్ కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌కు తోడు రజత్ పాటిదార్, కామెరూన్ గ్రీన్ మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు పంజాబ్ ఎదుట భారీ లక్ష్యాన్ని నిలిపింది. అనంతరం బంతితో పంజాబ్‌ను కట్టడిచేసి ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో పంజాబ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్న రెండో టీమ్‌గా నిలిచింది.

ధర్మశాల: ఆరంభంలో వరుస పరాజయాలతో నిరాశపరిచినా ఐపీఎల్ –17 రెండో దశ నుంచి జూలు విదిల్చిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి వరుసగా నాలుగో విజయం సాధించింది. బెంగళూరు నిర్దేశించిన 242 పరుగుల ఛేదనలో పంజాబ్.. 181 పరుగులకే చేతులెత్తేయడంతో 60 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘనవిజయం సాధించింది. రన్ మిషీన్ విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 92, 7 ఫోర్లు, 6 సిక్సర్లు) తృటిలో శతకం చేజార్చుకోగా రజత్ పాటిదార్ (23 బంతుల్లో 55, 3 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. భారీ ఛేదనలో పంజాబ్.. 17 ఓవర్లలో 181 పరుగులే చేయగలిగింది. రిలీ రూసో (27 బంతుల్లో 61, 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శశాంక్ సింగ్ (19 బంతుల్లో 37, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

కోహ్లీ, పాటిదార్ మెరుపులు

మ్యాచ్ ఆరంభంలోనే 3, 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌లను పంజాబ్ ఫీల్డర్లు నేలపాలు చేయడంతో వచ్చిన అవకాశాన్ని అతడు సద్వినియోగం చేసుకున్నాడు. డుప్లెసిస్ (9), జాక్స్ (12) నిరాశపరిచినా పాటిదార్‌తో కలిసి ఆర్సీబీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. హర్షల్ పటేల్ 6వ ఓవర్లో 3 ఫోర్లు బాదిన పాటిదార్.. రాహుల్ చాహర్ 8వ ఓవర్లో 3 సిక్సర్లతో రెచ్చిపోయాడు. పాటిదార్ ఇచ్చిన రెండు క్యాచ్‌లనూ పంజాబ్ ఫీల్డర్లు జారవిడవడం ఆర్సీబీకి కలిసొచ్చింది. 21 బంతుల్లోనే అర్ధ శతకం చేసిన అతడిని సామ్ కరన్ ఔట్ చేశాడు. మరో ఎండ్‌లో కోహ్లీ.. లివింగ్‌స్టాన్ 13వ ఓవర్లో ఫోర్ కొట్టి హాఫ్ సెంచరీ పూర్తిచేశాక మరింత జోరు పెంచాడు. కరన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు అర్ష్‌దీప్ 18వ ఓవర్లో 4,6తో 90ల లోకి వచ్చిన విరాట్.. అదే ఓవర్లో నాలుగో బంతికి కవర్స్ వద్ద రూసోకు క్యాచ్ ఇచ్చి శతకాన్ని మిస్ చేసుకున్నాడు. ఆఖర్లో కామెరూన్ గ్రీన్ (27 బంతుల్లో 46, 5 ఫోర్లు, సిక్స్), దినేశ్ కార్తీక్ (18) మెరుపులతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

ఆ ఇద్దరు తప్ప..

కొండంత లక్ష్యాన్ని ఛేదించడానికి క్రీజులోకి వచ్చిన పంజాబ్ ఇన్నింగ్స్ నాలుగో బంతికే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌గా వచ్చిన రూసో.. బెయిర్ స్టో(27)కు జత కలిసి దూకుడుగా ఆడాడు. 16 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్స్‌తో ఊపు మీద కనిపించిన బెయిర్ స్టోను ఫెర్గూసన్ ఔట్ చేశాడు. ఎదుర్కొన్న తొలి బంతి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డ రూసో.. సిరాజ్ 4వ ఓవర్లో 3 ఫోర్లు, ఓ సిక్స్‌తో జోరు పెంచాడు. కానీ ఫెర్గూసన్ ఆరో ఓవర్లో బెయిర్ స్టోను ఔట్ చేశాడు. అతడి స్థానంలో వచ్చిన శశాంక్ సింగ్ కొంతసేపు పోరాడాడు. 20 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేసుకున్న రూసోను కర్ణ్‌శర్మ బోల్తా కొట్టించడంతో పంజాబ్ తడబడింది. శశాంక్‌ను కోహ్లీ రనౌట్‌తో వెనక్కి పంపగా జితేశ్ (5), లివింగ్‌స్టాన్ (0), అశుతోష్ (8), కరన్ (22) విఫలమయ్యారు. లోయార్డర్ బ్యాటర్లను సిరాజ్ (3/43) ఔట్ చేయడంతో ఆర్సీబీకి భారీ విజయం సాధ్యమైంది. స్వప్నిల్‌సింగ్, ఫెర్గుసన్, కర్ణ్‌శర్మ రెండేసి వికెట్లు తీశారు.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 241/7 (కోహ్లీ 92, పాటిదార్ 55, హర్షల్ 3/38, విద్వత్ 2/36). **పంజాబ్:** 17 ఓవర్లలో 181 (రూసో 61, శశాంక్ 37, సిరాజ్ 3/43, స్వప్నీల్ 2/28)

కోహ్లీ (92)

2

90లలో ఔట్ అవడం ఐపీఎల్‌లో కోహ్లీకి ఇది రెండోసారి. 2013 సీజన్‌లో ఢిల్లీపై 99 పరుగుల వద్ద ఔట్ అయ్యాడు.

బజరంగ్‌పై వేటు

ఈ ఏడాది చివరిదాకా సస్పెండ్ చేసిన యూడబ్ల్యూడబ్ల్యూ • పారిస్ ఒలింపిక్స్ 'కలే'నా?

ఢిల్లీ: టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బజరంగ్ పునియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. గత నెల18న అతడు డోప్ టెస్టుకు మూత్ర నమూనాలు ఇవ్వలేదనే కారణంగా ఇదివరకే జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) అతడిపై తాత్కాలిక సస్పెన్షన్ వేటు వేయగా తాజాగా యూనైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ) కూడా పునియాను ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు సస్పెండ్ చేసింది. యూడబ్ల్యూడబ్ల్యూ నిర్ణయంతో పునియా పారిస్ ఒలింపిక్స్ కల 'కలగానే' మిగిలే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గురువారం స్పోర్ట్స్ అథారిటీ (శాయ్) పునియా విదేశీ శిక్షణ నిమిత్తం రూ. 8.82 లక్షల అందజేతకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం.

ముగిసిన మనిక పోరు

జెడ్డా: సౌదీ అరేబియా వేదికగా జరుగుతున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) గ్రాండ్ స్మాష్ టోర్నమెంట్‌లో భారత స్టార్ ప్యాడ్లర్ మనిక బాత్రా పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. గురువారం ముగిసిన మహిళల సింగిల్స్ పోరులో మనిక.. 1–4 తేడాతో ప్రపంచ 14వ ర్యాంకర్ హినా హయట (జపాన్) చేతిలో పరాభవం పాలైంది. రెండో రౌండ్‌లో వరల్డ్ నంబర్ 2 వాంగ్ మన్యును ఓడించిన మనిక.. ప్రిక్వార్టర్స్‌లో మరో కఠిన ప్రత్యర్థి నీనా మెతెల్‌హమ్ (జర్మనీ)ని చిత్తు చేసి క్వార్టర్స్ చేరిన విషయం విదితమే.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
కోల్‌కతా	11	8	3	1.45	16
రాజస్థాన్	11	8	3	0.47	16
హైదరాబాద్	12	7	5	0.40	14
చెన్నై	11	6	5	0.70	12
ఢిల్లీ	12	6	6	-0.31	12
లక్నో	12	6	6	-0.76	12
బెంగళూరు	12	5	7	0.21	10
ముంబై ✓	12	4	8	-0.21	8
పంజాబ్ ✓	12	4	8	-0.42	8
గుజరాత్	11	4	7	-1.32	8

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

సర్కారువారి పాట

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): అందినకాడికి ఏది దొరికితే అది అమ్ముకొని సొమ్ము చేసుకోవాలన్న కేంద్రంలోని బీజేపీ సర్కారు దురాశకు ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) బలిపశువులుగా మారాయి. గడిచిన పదేండ్ల మోదీ హయాంలో పీఎస్‌యూల్లోని వాటాల విక్రయంతో ఖజానాకు రూ.5 లక్షల కోట్లు సమకూరాయి. దీని కోసం చట్టంలోని నిబంధనల్ని ప్రభుత్వం ఏకపక్షంగా మార్చేసింది. ఏటికేడూ అంచనాలకు మించి లాభాలను గడిస్తున్న కంపెనీలు.. నష్టాల ఊబిలోకి కూరుకుపోయినట్టు కట్టుకథలు ప్రచారం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పీఎస్‌యూలు చెల్లిస్తున్న డివిడెండ్ల లెక్కలను విశ్లేషిస్తే ఈ విషయం అర్థమవుతున్నది. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడానికే కేంద్రం ఈ విధంగా చేసిందని హక్కుల కార్యకర్తలు మండిపడుతున్నారు.

పీఎస్‌యూలను తెగనమ్మిన బీజేపీ ప్రభుత్వం

1991 నుంచి ఇప్పటివరకూ జరిగిన అమ్మకాల్లో 74 శాతం విక్రయాలు మోదీ హయాంలోనే

ఖజానాకు వచ్చిన రాబడి 5 లక్షల కోట్లు

కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడానికేనంటూ విమర్శలు

అంచనాలకు మించి డివిడెండ్లు..

కంపెనీలు తమకు వచ్చిన లాభాల్లో కొంత మొత్తాన్ని వాటాదారులకు డివిడెండ్ల రూపంలో చెల్లిస్తాయి. గడిచిన పదేండ్లలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్‌యూల్లో) రూ.5 లక్షల కోట్ల వాటాలను మోదీ సర్కారు విక్రయించినప్పటికీ, ఇంకా ఆయా సంస్థల్లో కేంద్రానికి వాటాలు మిగిలే ఉన్నాయి. దీంతో తాము గడించిన లాభాల్లో సీపీఎస్‌యూలు కేంద్రానికి ఏటా చెల్లింపులు చేస్తూ వస్తున్నాయి. అయితే కేంద్రం బడ్జెట్ అంచనాలకు మించి సీపీఎస్‌యూలు డివిడెండ్లు చెల్లిస్తుండటం గమనార్హం. ఉదాహరణకు.. 2020–21 ఆర్థిక సంవత్సరానికిగాను సీపీఎస్‌యూల ద్వారా కేంద్రం అంచనా వేసిన డివిడెండ్ రూ.34,717 కోట్లు. కానీ ఆయా సంస్థలు రూ.39,750 కోట్లు (12.6 శాతం ఎక్కువ) చెల్లించాయి. ఆ మరుసటి ఏడాది 28 శాతం అధికంగా ఇచ్చాయి. ఈ మేరకు యూనియన్ బడ్జెట్ పత్రాలు–దీపమ్ వెల్లడించాయి. లాభాలు గడించనిది.. సీపీఎస్‌యూలు ఇంత పెద్దమొత్తంలో ప్రభుత్వానికి డివిడెండ్లు ఎలా చెల్లించగలవని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు నష్టాల్లో ఉన్నాయన్న కేంద్ర ప్రభుత్వం మాటలు అబద్ధాలని ధ్వజమెత్తుతున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి సీపీఎస్‌యూల డివిడెండ్లు..

ఆర్థిక సంవత్సరం	డివిడెండ్ (రూ.కోట్లలో)
2015-16	30,616
2016-17	51,852
2017-18	46,499
2018-19	43,052
2019-20	35,543
2020-21	39,750
2021-22	59,101
2022-23	50,550 (అంచనా)

గొంతు పిసికేయాలని..

ఏ కంపెనీ అయిన తమ శాఖలను విస్తరించడానికి.. వచ్చిన లాభాలను పెట్టుబడుల రూపంలో మళ్లిస్తాయి. అయితే, సీపీఎస్‌యూల విస్తరణను వ్యతిరేకిస్తున్న కేంద్రం వాటిని ప్రైవేటీకరించడానికే పట్టుబడుతున్నది. ఈ క్రమంలోనే కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఏ సీపీఎస్‌యూ అయినా.. వచ్చిన లాభాల్లో 30 శాతాన్ని (పన్నులు కాకుండా) లేదా నికర విలువలో 5 శాతాన్ని.. ఈ రెండింట్లో ఏది ఎక్కువ అయితే దాన్ని, కేంద్రానికి డివిడెండ్ల రూపంలో చెల్లించాలని నిబంధన తీసుకొచ్చింది. దీంతో ఏటికేడు లాభాలు గడిస్తున్నా.. కేంద్రం కొర్రీలతో సీపీఎస్‌యూలు విస్తరణకు నోచుకోవడంలేదు. నిబంధనలకు లోబడి గత ఎనిమిదేండ్లలో సీపీఎస్‌యూలు రూ.3,25,132 కోట్లు కేంద్రానికి చెల్లించాయి. దీన్నిబట్టి ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ సర్కారు ఎంతగా తెగనమ్ముతున్నదో అర్థం చేసుకోవచ్చు.

విక్రయాల జోరు ఇలా..

- ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ గురించి 1991–92 మధ్యంతర బడ్జెట్‌లో నాటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన సంకీర్ణ ప్రభుత్వాలు 1991–99 మధ్యకాలంలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.17,557 కోట్లు ఆర్జించాయి.
- 1999 నుంచి 2004 వరకు వాజ్‌పేయి ప్రభుత్వం రూ.27,599 కోట్లు.. 2004–14 మధ్య రెండుసార్లు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం రూ.1.33 లక్షల కోట్లు రాబట్టుకొన్నాయి.
- 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పీఎస్‌యూల్లో పెట్టుబడుల ఉపసంహరణ ఆకాశమే హద్దుగా సాగింది.
- 2014–19లో మోదీ సర్కారు పీఎస్‌యూల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.3.2 లక్షల కోట్లు పిండుకొన్నది. ఆ తర్వాత 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ మరో రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించింది. అంటే గత పదేండ్లలో మొత్తం రూ.5 లక్షల కోట్లు (ప్రస్తుత ద్రవ్యోల్బణ రేటును పరిగణనలోకి తీసుకొంటే రూ.6.5 లక్షల కోట్లు) రాబట్టుకొన్నదని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , డీఐపీఏఎం చెప్పాయి.

పెట్టుబడుల ఉపసంహరణలు (రూ.లక్షల కోట్లలో)

సంవత్సరం	ఆదాయం
1991-99	0.18
1999-2004 (వాజ్‌పేయీ హయాంలో)	0.28
2004-14 (కాంగ్రెస్ పాలనలో)	1.33
2014-24 (మోదీ హయాంలో)	5

ఎస్బీఐ లాభం 21 వేల కోట్లు

ముంబై, మే 9: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అదరగొట్టింది. మార్చి త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.21,384.15 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.18,093.84 కోట్లతో పోలిస్తే 18.18 శాతం అధికమని పేర్కొంది. ఏకీకృత విషయానికి వస్తే బ్యాంక్ లాభం రూ.16,694.51 కోట్ల నుంచి రూ.20,698.35 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.1.06 లక్షల కోట్ల నుంచి రూ.1.28 లక్షల కోట్లకు చేరుకున్నది.

- 2023–24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.67,084.67 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 21.59 శాతం అధికం.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.1,609 కోట్ల నిధులను వెచ్చించింది.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.24 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ కూడా 0.57 శాతానికి తగ్గింది.
- స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి షేరు 1.14 శాతం లాభపడి రూ.819.65కి చేరుకున్నది.

వాణిజ్య

ఇఫ్కోతో మారుట్ జట్టు

న్యూఢిల్లీ, మే 9: ఎరువుల తయారీ సంస్థ ఇఫ్కోతో జట్టుకట్టింది ప్రముఖ డ్రోన్ల తయారీ సంస్థ మారుత్ డ్రోన్. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో 5 లక్షల ఎకరాల్లో డ్రోన్ల సహాయంతో మందులు పిచికారి చేయనున్నారు.

హెచ్‌పీసీఎల్ 1:2 బోనస్ షేరు

న్యూఢిల్లీ, మే 9: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. రిఫైనింగ్ మార్జిన్లు తగ్గుముఖం పట్టడంతో గత త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 25 శాతం తగ్గింది. జనవరి–మార్చి మధ్య కాలానికిగాను సంస్థ రూ.2,709.31 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరోవైపు, బోనస్ కింద ప్రతి రెండు షేర్లకు ఒక్క షేరును ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించింది.

స్విఫ్ట్ నయా వెర్షన్

గరిష్ఠ ధర రూ.9.64 లక్షలు

న్యూఢిల్లీ, మే 9: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో పోటీని మరింత తీవ్రతరం చేయడంలో భాగంగా నూతన జనరేషన్ స్విఫ్ట్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు రూ.6.49 లక్షల నుంచి రూ.9.64 లక్షల గరిష్ఠ ధరల్లో లభించనున్నది. నాలుగు విభాగాల్లో లభించనున్న ఈ కారు ఎల్ఎక్స్ఐ మాడల్ ధర రూ.6.49 లక్షలు, వీఎక్స్ఐ రూ.7,29,500 నుంచి రూ.7,79,500, వీఎక్స్ఐ(వో) ధర రూ.7.56 లక్షల నుంచి రూ.8.06 లక్షలు, జెడ్ఎక్స్ఐ ధర రూ.8,29,500 నుంచి రూ.8,79,500 విక్రయిస్తున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా మారుతి సుజుకీ ఎండీ, సీఈవో హిసాషీ తకేచి మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఎంట్రీ లెవల్ కార్లకు భవిష్యత్తులోనూ డిమాండ్ ఉంటుందని, మొత్తం వాహన విక్రయాల్లో వీటి వాటా 28 శాతంగా ఉండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. ఈ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్ తయారు చేయడానికి సంస్థ రూ.1,450 కోట్ల మేర పెట్టుబడి పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో ఏటా 7 లక్షల ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ కార్లు అమ్ముడవుతుండగా, 2030 నాటికి 10 లక్షలకు చేరుకునే అవకాశం ఉన్నదన్నారు. అలాగే ఈ మాడల్ నెల వారి సబ్‌స్క్రిప్షన్‌తో అందుబాటులో ఉం